క్లుప్తంగా

పీ -4 సర్వే వేగవంతం



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రమీలాగాంధీ

దత్తిరాజేరు: గ్రామాలలో నిరుపేద కుటుంబాలను గుర్తించి వారిని బలోపేతం చేసేందుకు చేపడుతున్న పీ 4 సర్వేను వేగవంతం చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రమీలాగాంధీ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు గుర్తించిన బంగారు కుటుంబాలపై ఆరా తీశారు. అలాగే కార్యదర్శుల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఏఓ శివాజీ పాల్గొన్నారు.

క్లోరినేషన్ చేయాలి



తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ హైమావతి, తదితరులు

గంట్యాడ: తాగునీటి వనరుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి ఆదేశించారు. మండలంలోని రామవరంలో గల తాగునీటి వనరులను పంచాయతీ, వైద్య సిబ్బందితో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్పీఓ శిరీషారాణి, గంట్యాడ పీహెచ్‌సీ వైద్యుడు వందన, పీరుబండి జైహింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది..



మాట్లాడుతున్న వేదిక అధ్యక్షుడు సూర్యారావు

శృంగవరపుకోట: ప్రజాస్వామ్యానికి ఓటే పునాదని.. అటువంటి ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు సూర్యారావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు అక్షరాస్యత వేదిక నేతృత్వంలో ప్రిన్సిపాల్ వాసుదేవరావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో వేదిక అధ్యక్షుడు సూర్యారావు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 15న నిర్వహించనున్న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించారు. సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు ఆర్.శ్రీలక్ష్మి, ప్రభాకర్, సీహెచ్.శ్రీనివాసరావు, బి.సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు మోడల్ పాఠశాల విద్యార్థి



సెపక్ తక్రా పోటీలకు ఎంపికైన విద్యార్థి రాజేష్‌ను అభినందిస్తున్న ప్రిన్స్‌పాల్ ఈశ్వరరావు

దత్తిరాజేరు: రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు స్థానిక మోడల్ పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎస్. లోకేష్ ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల నెల్లిమర్ల మండలం అలుగోలు ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో జరిగిన అండర్ – 19 స్కూల్ గేమ్స్‌లో లోకేష్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. ఈ సందర్భంగా లోకేష్‌ను పీఈటీ రాజేష్, తదితరులు అభినందించారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి

- సీడీపీఓ ఉమాభారతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓఉమాభారతి

గంట్యాడ: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని సీడీపీఓ డి. ఉమాభారతి అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న కేజీబీవీలో మహిళలు, బాలల సంక్షేమానికి రూపొందించిన చట్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ టి.అనిత, కేజీబీవీ ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి, చైల్డ్‌లైన్ ప్రతినిధి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారులకు మోక్షమెప్పుడో..?

- అధ్వానంగా గర్భాం – గరివిడి ప్రధాన రహదారి
- అస్తవ్యస్తంగా ఎన్‌జీఆర్ పురం
- చెరువులను తలపిస్తున్న రోడ్లు



గర్భాం నుంచి గరివిడి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి

మెరకముడిదాం: నియోజకవర్గ పరిధిలోని రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రోడ్లను అద్దంలా మెరిపిస్తాయని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. మొదట్లో కొద్దో గొప్పో రహదారులకు మరమ్మతులు చేపట్టినా.. పనులు నాసిరకంగా ఉండడంతో రోజుల వ్యవధిలోనే వాటి పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. తాము ఇబ్బంది పడుతున్నా రహదారులను అభివృద్ధి చేయకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. మెరకముడిదాం మండలంలోని గర్భాం నుంచి గరివిడి వెళ్లే ప్రధాన రహదారి మొత్తం గోతులమయమైంది. అయితే ఈ రహదారికి గతేడాది డిసెంబర్‌లో కూటమి ప్రభుత్వం రూ. 40 లక్షలతో మరమ్మతులు చేపట్టింది. అయితే సంబంధిత కాంట్రాక్టర్ అక్కడక్కడ గోతులు పూడ్చి పనులను మధ్యలోనే నిలిపివేశారు. ఈ రహదారి మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో మరీ అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వచ్చేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు కూడా ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం. ఈ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం మూడు కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందని, అధికారులు చెబుతున్నారే తప్ప పనులు ప్రారంభించడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

చెరువులను తలపిస్తున రోడ్లు..

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని మెంటాడ రోడ్డు నుంచి గంగచోళ్లపెంట గ్రామానికి వెళ్లే రహదారి చిన్నపాటి వర్షానికి కూడా చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డు మీదుగా నీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణానికి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రహదారులను అభివృద్ధి చేస్తామన్న హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడెక్కడున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను ఇబ్బందులను పాల్జేసే రహదారులను అభివృద్ధి చేసే బాధ్యత పాలకులకు లేదా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



గంగచోళ్లపెంట వెళ్లే దారిలో రహదారిపై పారుతున్న వర్షం నీరు



పురిటిపెంట గ్రామ కూడలి నుంచి గజపతినగరం వచ్చే దారి ఇలా..

చినుకు పడితే చిత్తడే..



ప్రమాదకరంగా ఉన్న ఎన్‌జీఆర్ పురం జగనన్న కాలనీ రహదారులు



అధ్వానంగా పురిటి పెంట న్యూకాలనీ రహదారి

గజపతినగరం: మండల కేంద్రంలో పలు చోట్ల రహదారులు నరకాన్ని తలపిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం నుంచి పురిటిపెంట భవిత సెంటర్‌కు.. ఆర్‌డబ్ల్యూఎస్ కేంద్రాలకు వెళ్లే రహదారి.. ఎన్‌జీఆర్ పురం, పురిటిపెంట రైల్వే కాలనీల్లో ఏర్పాటు చేసే జగనన్న కాలనీల రోడ్లు మరీ దారుణంగా తయారయ్యాయి. భవిత కేంద్రానికి రాకపోకలు సాగించడానికి దివ్యాంగులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చినుకు పడితే చాలు ఆయా రహదారుల్లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రహదారులను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

రూ. 5 లక్షలతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు



మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నారాయణరావు దంపతులు

మెరకముడిదాం: మండలంలోని గాదెలమర్రివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ నేరెల్ల నారాయణరావు గొట్టుపల్లి గ్రామంలో 5 లక్షల రూపాయలతో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు గొట్టుపల్లి సర్పంచ్ సుంకరి రమేష్, గ్రామపెద్దల సమక్షంలో ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. నారాయణరావు గాదెలమర్రివలసలో కూడా రూ. 5 లక్షలతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు.

తాజాగా పక్క గ్రామమైన గొట్టుపల్లిలో కూడా ప్లాంట్ ఏర్పాటు చేయడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు నారాయణరావు దంపతులను గొట్టుపల్లి వాసులు ఘనంగా సత్కరించారు.

ఉపాధ్యాయులకు అండగా పీఆర్‌టీయూ

- యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంబాబు



ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ సభ్యత్వ రశీదును అందజేస్తున్న రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు రాంబాబు

మెరకముడిదాం: ఉపాధ్యాయులకు అండగా ఉండడంతో పాటు వారి సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నది పీఆర్‌టీయేనని యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు అన్నారు. మండలంలోని ఇప్పలవలస ప్రాథమికోన్నత పాఠశాలను స్థానిక పీఆర్‌టీయూ నాయకులతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీ–2023 వారికి జీఓ 57ను అమలు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలన్నారు. తెలుగుపండిట్లకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సింహాద్రి, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సోంపురంలో ఇంటింటి కుళాయిలు



కుళాయిల ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ గంగరాజు, తదితరులు

వేపాడ: మండలంలోని సోంపురంలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు బుధవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ మురిపిండి గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులకు ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు మండల పరిషత్ నిధుల నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఆకుల సత్యనారాయణ, టీపీ రమణ, వైఎస్సార్‌సీపీ మండల యువత అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, నాయకులు టి.మల్లేశ్వరరావు, చింతల గోవింద, గణపతి, లక్ష్మీనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం



సోంపురం చెరువు గట్టుపై కొబ్బరి మొక్కలు నాటుతున్న ఎంపీపీ, తదితరులు

వేపాడ: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అన్నారు. ఈమేరకు మండలంలోని సోంపురంలో కోనేరు గట్టు చుట్టూ కొబ్బరి మొక్కలు బుధవారం నాటారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర నాయుడు



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాయుడు

చీపురుపల్లి: ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు డిమాండ చేశారు. పీఆర్‌టీయూ సంఘ సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం మండలంలోని రామలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త పీఆర్‌సీ ఏర్పాటు కాలేదన్నారు. అలాగే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. అంతేకాకుండా సరెండర్ లీవ్స్‌ను నగదు చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పి.రవికిషోర్, ఎం.జగన్నాథం, కంది గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన పలువురిని సహచర ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సత్కరించారు. సన్మానగ్రహీతలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. వేపాడ మండలం మారికలో తాడి రాంబాబు మాస్టారును ప్రజా ప్రతినిధులు, స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సన్మానించారు. అలాగే మండల కేంద్రంలో రోహిణి, రాంబాబు, అరుణకళ, శ్రీనివాసరావులను పీఆర్‌టీయూ తరఫున సత్కరించారు. ఎస్.కోట మండలం కొట్టాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు పి. స్వప్నను హెచ్‌ఎం రామ్‌కుమార్ ఆధ్వర్యంలో సహచర ఉపాధ్యాయులు సన్మానించారు.



వేపాడ: మారికలో రాంబాబు మాస్టారును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు



ఎస్.కోట: ఉపాధ్యాయురాలు స్వప్నను సన్మానిస్తున్న కొట్టాం హైస్కూల్ ఉపాధ్యాయులు

– వేపాడ/ఎస్.కోట

చిన్నారుల సంఖ్య పెంచాలి

- జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి విమలారాణి



పిల్లలతో ముచ్చటిస్తున్న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి విమలారాణి

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి టి. విమలారాణి అన్నారు. మండల కేంద్రంలోని ఒకటి, రెండు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కేంద్రాలను నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. పౌష్టికాహార లోపం ఉన్న వారిని ఎన్‌ఆర్‌సీకి రిఫర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ డి. ఉమాభారతి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

- సీడీపీఓ ఎం.రాజేశ్వరి

గజపతినగరం: రక్తహీనతతో ఉన్న ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ ఎం. రాజేశ్వరి తెలిపారు. పురిటిపెంట న్యూ కాలనీలోని బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు పౌష్టికాహారంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకున్నప్పుడు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి..

గుర్ల: మండలంలోని ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న అన్నపూర్ణాదేవికి ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి లభించింది. ప్రమోషన్‌పై ఆమెను కృష్ణా జిల్లాకు కేటాయించినట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆమెను ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు , వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, ఎంపీడీఓ సిబ్బంది అభినందించారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

చీపురుపల్లి: దాడుల్లో పట్టుబడిన 522 మద్యం బాటిళ్లను స్థానిక పోలీసులు డీఎస్పీ ఎస్.రాఘవులు సమక్షంలో బుధవారం ధ్వంసం చేశారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్లు సై్స ఎల్. దామోదరరావు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన



గజపతినగరం : లోగిశలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ కిరణ్‌కుమార్

గజపతినగరం: వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి రైతూ నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని ఏఓ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని లోగిశ, తుమికాపల్లి, మరుపల్లి, పాతబగ్గాం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయే ఎరువులు ఎప్పుడు పిచికారీ చేయాలో వివరించారు. నానో ఎరువుల వల్ల నీటి కాలుష్యం జరగదని.. తద్వారా ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు గోర్జా సూర్యసునీత, రోజా, తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: నల్లబిల్లిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

నల్లబిల్లిలో..

వేపాడ: మండలంలోని నల్లబిల్లిలో నానో యూరియా వినియోగంపై వ్యవసాయశాఖ కొత్తవలస సబ్ డివిజన్ ఎ.డి భానులత, స్థానిక ఏఓ స్వాతి అవగాహన కల్పించారు. నానో యూరియా 500 ఎం.ఎల్‌ను ఎకరా పొలంలో పిచికారీ చేస్తే 80 శాతం ఎరువుకు ఎరువు అందుతుందని చెప్పారు. ఈ వారంలో 72 టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ అక్కునాయుడు, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆకులపేటలో బోరు ఏర్పాటుకు శ్రీకారం



తాగునీటి బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీషా

చీపురుపల్లి: మేజర్ పంచాయతీ పరిధిలోని ఆకులపేటలో బోరు ఏర్పాటు చేసేందుకు జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీషా బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోరు ఏర్పాటుకు మండల పరిషత్ నిధులు రూ. 2 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఆకులపేటకు చెందిన పలువురు మహిళలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో బోరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు గిరడ రామదాసు, పార్టీ నాయకులు పతివాడ రాజారావు, మీసాల సాయికృష్ణ, మీసాల సత్యనారాయణ, గవిడి సురేష్, కోరుకొండ దాలయ్య, ముజీకీర్ మహ్మద్, తలచుట్ల రాము, కర్రోతు ప్రసాద్, కంచుపల్లి అశోక్, మండల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండో రోజు బుధవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రీ సర్వే జరగని గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. తొలిరోజు వివిధ సమస్యలపై 104 దరఖాస్తులు రాగా.. రెండో రోజు మ్యుటేషన్‌లకు 149 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఆయా సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు టి.రమేష్, కోటప్పారావు, ఆర్ఐ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.